# ధర్మవాహిని





భగవాన్
శ్రీ సత్యసాయిబాబా

# 6

# ధర్మమునకు చలనము లేదు

**మానవుని అనుకూలములనుబట్టి ధర్మములు మారవు :**

మానవుని అనుకూలములనుబట్టి ధర్మములు మారవు. ధర్మమునకు చలనములేదు. ఆనాడు నేడూ ఏనాడూ, ధర్మముగానే యుండును. సామాన్యధర్మములకు, ధర్మ విధులకు కారణములు, మార్పులు ఉంటే ఉండవచ్చునుకానీ, ఆ విధులను శాస్త్రీయదృష్టితోనే చూడవలెను. అందులోని లాభనష్టములను ఎన్నడూ చూడకూడదు. దృగ్గోచర లాభసాధ్యమైన ధర్మమును వేదశాస్త్రము లుపదేశించెనేని అధర్మాచరణకు శాస్త్రము ప్రమాణము కాజాలదు. ధర్మము ప్రత్యక్షానుమానాది ప్రమాణములచేత గ్రహింప వీలులేదు. వేదమంత్రముచేతనే తెలిసికొనదగినదనియు, ప్రత్యక్షాది ప్రమాణములచేత తెలిసికొన అశక్యమైన విషయమును బోధించుటకు మాత్రమే వేదము ప్రవర్తించుచున్నదనియు మీమాంసికుల సిద్ధాంతము.

హేతువుల నాశ్రయించి ధర్మములు చేస్తూవుంటే అప్పుడే ధర్మమును విడువకుండా తటస్థించుచూ వుంటుంది. అందరికీ ఒక హేతువే తోచదు. స్నాన సంధ్య జపధ్యానాదులవలన లాభం తలోవిధంగాను కనుపించుచుండును. కొందరు సంధ్యాసమయములో సంధ్యా గాయత్రీ జపము మానివేసి, విష్ణు సహస్రనామ పారాయణమో, శివసహస్రనామ పారాయణమో చేస్తూ

వుంటారు. 'కాలే సంధ్యా సమాచరేత్' అనగా సకాలమునకు సంధ్యావందనం చేయవలెను అని. ఈ మొదలైనవి ఎన్నో చెప్పబడియుంటే, కొంతమంది సకాలానికి సంధ్య మానివేయటము అధర్మమే కదా? ఇదే రీతిగనే ఆయా వర్ణములవారికి వారి వారి ఆచారధర్మములు సృష్టించబడేయున్నవి; అనుభవములో కనుపించుచున్నవి.

**ధర్మ రక్షణే దైవముయొక్క కర్తవ్యము :**

'చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగశః' అని గీతాచార్యుని బోధకదా! (దీని అర్థం సుబోధకం) లేనిపోని హేతువాదములను ఆశ్రయించి, శుష్కతర్కములను ఊహిస్తూ తమకు తోచిన యుక్తులతో అధర్మమును ఆచరించుచూ దైవ భయము, పాప భయము లేకుండా యేమియూ తెలియని అమాయకులనుకూడా తప్పుమార్గముల త్రొక్కించువారుకూడ అనేకులు కలరు. అందుకనే పతితులను పునీతులు చేయటానికి, ధర్మస్థాపన చేయటానికి భగవంతుడు అప్పుడప్పుడు అవతరించుచుండును. అసలు భగవంతుడు లోకమున అవతరించుటకుగూడ ధర్మమే కారణమని గీతయందు ఘంటాపథముగా చెప్పినాడు కదా!

"ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" ఇక్కడ ఒక్కటి చక్కగ గమనింపవలెను. ధర్మము నశించిపోయి, అధర్మ బల మెక్కువైనప్పుడు పరమాత్మ అవతరించుననని, సాధారణముగా

గీతాపారాయణము చేయువారు అనేకులు తలంతురు. అందులో ధర్మము 'నశించినట్లు' తలంచుటకు ఆధారములేదు. భగవంతుడు కూడ అట్లు తెలుపలేదు. అందుకనే 'గ్లాని' అని యుపయోగించినాడు. అనగా ధర్మమునకు హానివచ్చే సూచనలు కనుపించినపుడు నేను ధర్మరక్షణకు వత్తునని పలికెను కానీ, ధర్మము నశించిన తరువాత రక్షణకు వత్తునని తాను తెలుపలేదు.

రోగి ప్రాణమును వదలిన తరువాత డాక్టర్ వచ్చిన ప్రయోజన మేమి? అట్లే మానవుని ప్రాణసమానమైన ధర్మము చచ్చిన తరువాత భవరోగవైద్యుడైన భగవానుడు దేని రక్షణకని వస్తాడు? అందుకనే నశించినదని తెలుపక, హాని సంభవించినపుడు అను అర్థమును చూపు 'గ్లాని' అను పదమును వినియోగించెను. కాన, ధర్మ రక్షణమే దైవముయొక్క కర్తవ్యము. ఆ ధర్మమను ప్రాణమే జీవుల ఆధారముగా భావించవలెను.

**ధర్మాచరణలేని పురుషుడు శవ స్వరూపుడే :**

ధర్మమన్న సామాన్యము కాదు. ధర్మాచరణ లేని పురుషుడు శవస్వరూపుడే, లేక శిలాస్వరూపుడే. ఇప్పుడు అధర్మ మార్గ తత్పరులను ఎందరినో సామ, దాన, భేద, దండోపాయములచేత ధర్మాచరణతత్పరులుగా చేయవలెను. ప్రాచీన కాలమున సనాతన ధర్మ నిర్మూలనకు కంకణము కట్టుకొన్నవారి చేతులలో వున్న కత్తులు కంఠములపైకి వచ్చి, తమ ప్రాణము పోయే పరిస్థితులు వచ్చినమూ, ధర్మాచరణులు వారి ధర్మమును తప్పేవారు కారు. ఇప్పుడా? ఇతరుల

నిర్బంధము లేకయే, తమంతట తామే ధర్మాచరణనుంచి దిగజారుతున్నారు!

అంతియేకాక, ధర్మమునకు పలు అర్థములు సృష్టించి, ధర్మ మార్గమున నడచువారలకుకూడ అనేక విధముల ఆటంకములు కలిగించుచూ వారిని ఎండుగడ్డికంటె హీనముగా చూచుచున్నారు. ధర్మాచరణతత్పరులను వంచకులనీ, వారివి కపటాచారములని తలచుచున్నారు. అట్లే మూర్ఖులకు ధర్మమంటే ఏమిటో తెలియదు. అసలు యథార్థమైన విషయమును తెలిసికొను శక్తిలేక, కేవలము పదార్థమైనా తెలియని పామరులు, పాపము అను పదానికీ అర్థము తెలియనివారు, యథార్థమైన ధర్మార్థమును ఏమని తలంతురో యెవరికి వారే యోచించవచ్చును. పుట్టు అంధునికి సూర్యుడంటే యేమి తెలుసు? సూర్యరశ్మి అంటే యేమి తెలుసు? దేహముపై పడినపుడు వేడి మాత్రమే తెలుసును కానీ, దాని స్వరూపమెట్లు అర్థమగును?

అట్లే ధర్మాచరణ లేనివాడు, ధర్మతత్త్వముపై విశ్వాసము లేనివాడు, వాని ఫలానందము ఏ రీతిగా అర్థము చేసికొనగలడు? అట్టివానిముందు ధర్మతత్త్వము విశదపరచుట, చెవిటివానిముందు శంఖమూదినట్లుండును. నోటిలోని శంఖము కనుపించును, కాని, దానిలోని నాదము వినుపించునా? కాన, ఒకరికి బోధించుటలో వినువారి శ్రద్ధను గమనించి, ధర్మమును ఆచరించుటకు అనుగుణంగా నున్న వానిని తగినరీతుల తీర్చి దిద్దుటకు

ప్రయత్నించిన, అట్టివారి ఆచరణానుభవములచేత క్రమక్రమేణా మూర్ఖులుకూడా అభిమానపు మొలకలు నాటుటకు ప్రయత్నింతురు.

**హేతువాదులు విశ్వాసహీనులై ధర్మము నాచరించరు :**

నేడు, ఎంతోమంది గొప్ప విద్యావంతులు, శాస్త్ర వాసన, వేదవాసన, పాండిత్యములు కలవారును, వానియందలి విశ్వాసములను కోల్పోయి, ధర్మములను ఆచరించక, విశ్వాసహీనులై ధర్మమును ఆచరించక, లోకభీతిచేతను, నవీన విద్యల సంప్రదాయముచేతను, మధ్యమధ్య తమకు తోచిన కుయుక్తుల చేతను, సనాతన ధర్మ సంప్రదాయమైన ఏకాదశీ వ్రతమును కూడ (అనగా ఉపవాసమును కూడ) స్నాన, సంధ్య, ఉపవాసములు ఆరోగ్యము కోసమే యని, కర్పూర హారతులు, వానిజ్వాల, ధూమము ఊపిరితిత్తులకు జబ్బు అనియూ, ప్రాణాయామములు జీర్ణరోగ హరములనియు, తీర్థయాత్రలు, పుణ్యనదీ స్నానములు ఇత్యాది వన్నియు లోకానుభవం కలుగడం కోసమనియూ, దానధర్మములు పేరు ప్రతిష్ఠల కనియు, ఇంకను ఎంతోమంది అనేకవిధముల పవిత్ర కార్యములను అపవిత్రభావములలోనికి దింపుచున్నారు.

అట్టివారు లోకవంచకులు, ధర్మతత్త్వము పాలిటి దానవులు. ఇట్టివారు మనుధర్మమును విచారించిన కొంత బోధపడగలదు.

**ఆర్షం ధర్మోపదేశం చ వేదశాస్త్రావిరోధినా**
**యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద, నేతరః**

అన్నాడు మనువు. అనగా వేదమూ, ధర్మశాస్త్రమూ ఈ

రెండింటినీ వేదశాస్త్రములకు విరోధముకాని తర్కములతో ఎవడు విమర్శిస్తున్నాడో వాడే ధర్మ మెరుగగలడు. కానీ, యితరులెరుగ జాలరు. దీని అంతరార్థ మేమన ఏ యూహ వేదశాస్త్రములకు విరోధముగా నుండదో, ఆ దానినే మనువు గ్రహించినాడు కానీ, వేదశాస్త్రములు తర్కమూలమని తెలుపలేదు. లేనిపోని శుష్కతర్కములవలన ప్రయోజన మేమియులేదు, రాదు. చాలామంది ఇప్పటికాలమున హేతువాదము నాశ్రయించి, తాము అధర్మాచరణ గావిస్తూ ధర్మాచరణతత్పరులనుకూడా హేతువాదములు చేసి ధర్మదూరులను గావించుచున్నారు. అందుకనే వేదవ్యాసుడు నేటికాలపు మార్పును గూర్చి మునుపే తెలిపినాడు. అట్టివారికి ఆరాధనా దైవచింతనలు విరోధములుగా నుండును.

**న యక్షంతి, న హోష్యంతి, హేతువాద విమోహితాః**
**నీచకర్మ కరిష్యంతి, హేతువాద విమోహితాః**

అనగా, "హేతువాదము లాశ్రయించినవారు దేవతా రూపములను పూజించరు; అగ్నులందు హోమము చేయరు, నీచకార్యాచరణలందు ప్రవేశింతురు", – అని మహాభారతమున అరణ్యపర్వమునందు, కలివర్ణనలో చెప్పబడెనుకదా!

**ధర్మకర్మలయందు స్త్రీ పురుషు లిద్దరికీ సమాన హక్కు కలదు :**

వేయేటికి? ధర్మాచారమువల్లనే సూర్యచంద్రాదులు తమ గతులు తప్పకుండ సంచరించుచున్నారు. సమస్త దేవతలు తమ విధులు నిర్వహించుచున్నారు. పంచభూతములు ధర్మాధారంగానే

వెలయుచున్నవి. ధర్మమునుండి తాను ప్రమాదమును పొందక, ఇతరులను ప్రమాదములకు గురిచేయక ఉండవలెను. ధర్మధ్వజ కాంతి ప్రపంచమంతటా కళను చిమ్మవలెను. తర్కములకు చోటివ్వక, బుద్ధులను పాడుచేసికొనక, యథార్థ ఆత్మతత్త్వమును విశ్వసించి, దానిమూలమున, ఆధారమున, ఆచార ధర్మములను అనుష్ఠానమునందు నిత్యకృత్యములతో లీనమొనర్చి, ఆనందమును అనుభవించుట అత్యవసరము.

లోకానుభవములో "ఉద్యోగం పురుషలక్షణం" అని గానీ, కర్మ పురుషలక్షణమనిగానీ అందురు. అది యే మాత్రము సమ్మతించవలసినది కాదు. ఎందుకన, ఈ కాలమున అందరికీ ఉద్యోగములు ప్రాప్తించునా? లేదు. అట్లు ఉద్యోగము చేయనివారు పురుషలక్షణము లేనివారగుదురన్నమాట! ఇవి కేవలము వారి వారి అనుకూలతలను పట్టి తలంతురేకానీ, సర్వులకూ సమమైనది, 'ధర్మం పురుషలక్షణం'. ప్రతిపురుషుడుకూడా ధర్మార్థ కామమోక్షములందు ధర్మకర్మల ననుసరించవలెను. అవే పురుషార్థ ధర్మములు. స్త్రీలకు పతివ్రతా ధర్మ మెట్లో, పురుషులకు బ్రహ్మచర్య మట్లు. స్త్రీకి ఏకపతి యెట్లో, పురుషునకు యేకసతి అట్లు. స్త్రీ పతిని ఏ రీతిగా దైవముగా తలంచి అతని మనసు ననుసరించి ప్రవర్తించుట ఎట్లు పతివ్రతాధర్మమో, పతికూడ తన సతిని గృహలక్ష్మిగా భావించి, ఆమె మనసు ననుసరించి ప్రవర్తించవలెను. అప్పుడే పురుషలక్షణములకు తగినవాడగును. మాన మర్యాదలుకానీ, పేరు ప్రతిష్ఠలుకానీ, అగౌరవ అపకీర్తులుకానీ, దుశ్శీల

దుర్గుణములు కానీ, స్త్రీలకూ పురుషులకూ సమానములే.

స్త్రీలు మాత్రమే పై నిబంధనకు బద్ధులనియు, పురుషులు స్వతంత్రులనియు లేదు. స్త్రీలైనను, పురుషులైనను పైధర్మములు పాటించవలెను. స్త్రీలు పురుషులచేతి కీలుబొమ్మలు కాదు. ధర్మకర్మలయందు ఇద్దరూ సమానహక్కు కలవారే. ధర్మాచరణలయందు, ఇద్దరూ శాంతి, సత్య, ప్రేమ అహింసలను పాటించవలెను. ఈ నాలుగు పవిత్రపదముల భావములను పాటించక ప్రవర్తించిన, ధర్మరహితులగుదురు. స్త్రీ లెట్లు కొన్నిటియందు అస్వతంత్రులో, పురుషులకు కూడ అట్లే కొన్నింటియందధికారము లేదు. ఇవి, సతి పతుల ప్రమాణ నిబంధనలలో కొన్ని.